క్లుప్తంగా

రాధాకృష్ణుని అలంకరణలో కాపులకొడప వెంకన్న



రాధాకృష్ణుల అలంకరణలో దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి.

నరసాపురం రూరల్: మేములదీవి కాపులకొడపలో వేంచేసిఉన్న వెంకటేశ్వరస్వామివారిని కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాధాకృష్ణులుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఇక్కడి స్వామివారు కోరిన కోర్కెలు తీర్చే కోనేటిరాయుడిగా ప్రసిద్ధికెక్కడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. దీనికితోడు స్వామివారిని రాధా సమేతకృష్ణులుగా అలంకరించి పూజలు నిర్వహిస్తుంటారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని మూడు రోజులపాటు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు చెన్నాప్రగడ చక్రధరరావు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం సుమారు వెయ్యిమంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పొరపాట్లకు తావివ్వకూడదు

పెనుగొండ: కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆచంట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ చేసే సమయంలో తప్పనిసరిగా వెళ్లి వారి వివరాలు ధ్రువీకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.సుగుణసంధ్య, సీహెచ్ జయలలిత, వీఆర్వో సీతారామ్ ఉన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలని ర్యాలీ



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

నరసాపురం: చట్టాలను కఠినతరం చేసి మహిళలకు భద్రత కల్పించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం హత్య చేసిన ఘటనలో నిందితులను శిక్షించాలని కోరుతూ శనివారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినిలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎన్ కళాశాల నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకూ నిరసన ర్యాలీ సాగింది. అంబేడ్కర్ సెంటర్‌లో ఐద్వా జిల్లా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని వాపోయారు. దేశంలో 151 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై అత్యాచారం కేసులున్నాయని అన్నారు. మహిళపై అకృత్యాలకు పాల్పడిన వారికి సరైన శిక్షలు పడకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం కావడానికి కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని మహిళలకు భద్రత, భరోసా కలిగించేలా కఠిన చట్టాలు అమలులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ రామ్‌కుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరజ్, డి.అనిల్‌బాబు నాయకత్వం వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మొగల్తూరులోని గొల్లగూడెంలో పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని డాక్టర్ దినేష్ సూచించారు. మొగల్తూరు గ్రామంలోని పెద్ద గొల్లగూడెంలోని ఇళ్ల పరిసరాలను శనివారం ఆయన పరిశీలించి చెత్త, చెదారాలను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలను నివారించవచ్చన్నారు. ఇంటి ఆవరణల్లో పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, కుండలు, పగిలిన సిమెంట్ కుండీలు, ఖాళీ డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా కిటికీలకు, తలుపులకు మెస్‌లు అమర్చుకోవాలన్నారు. జ్వరం లక్షణాలు కనపడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్‌ను సంప్రదించాలని, ఆసుపత్రిలోని డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే దగ్గరలోని ఆసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి, ఎంపీహెచ్ఏకే శ్రీనివాస్, ఏఎన్ఎమ్ స్వరూపరాణి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కఠినంగా శిక్షించాలి



వైద్యులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలి. దీంతో మరొకరు దాడి చేయడానికి భయపడతారు. చట్టాలను కఠినతరం చేసిన నాడే ఇది సాధ్యమవుతుంది. ముఖ్యంగా మహిళా వైద్యులకు భద్రత పెంచాలి. దాడులు జరగక ముందే పోలీసులు వెంటనే స్పందిస్తే భద్రత ఏర్పడుతుంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– అద్దాల ఉమామహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్, మార్టేరు పీహెచ్‌సీ

ఆడపిల్లలపై చెయ్యి వేయాలంటే వణుకు పుట్టాలి



దేశంలో చట్టాలు కఠినంగా లేకపోవడం వలనే స్వాతంత్ర్యం ఇన్నేళ్లయినా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. ఆడపిల్లలపై చెయ్యి వేయాలంటే ఒంట్లో వణుకు పుట్టేలా చట్టాలు ఉండాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే మహిళ సిబ్బందికి ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు ఉండడం లేదు. మహిళలు రాత్రి సమయంలో పనిచేసే ప్రాంతాల్లో కనీస వసతులు, భద్రత కల్పించాలి.

– కె.మంగతాయారు, స్టాఫ్ నర్స్, మేడపాడు పీహెచ్‌సీ, యలమంచిలి మండలం

ముస్తాబవుతున్న గణనాథులు

- పాలకొల్లు కేంద్రంగా విగ్రహాల తయారీకి డిమాండ్
- రూ.3 వేల నుంచి రూ.40 వేలు పలుకుతున్న ధరలు
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీకే మొగ్గు
- మట్టి విగ్రహాల తయారీకి ఆర్డర్లు తీసుకుంటున్న వైనం



వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు



విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

పాలకొల్లు సెంట్రల్: భక్తుల నుంచి తొలి పూజలు అందుకుని విఘ్నాలను తొలగించే అధినాయకుడు మహాగణపతి నవరాత్రుల ఉత్సవాలు మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 7వ తేదీన భాద్రపద శుద్ధ చవితి రోజు ప్రారంభమై తొమ్మిది రోజులపాటు జరిగే వినాయక చవితి ఉత్సవాలకు పూజలందుకోనున్న గణనాథులు ముస్తాబవుతున్నారు. ఉత్సవాల సమయం సమీపిస్తుండటంతో తయారీదారులు వేగం పెంచుతూ విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. గతంలో గణపతి విగ్రహాలు తయారీ పూర్తిగా మట్టితో తయారు చేసేవారు. ఉత్సవ నిర్వాహకులు నేడు విగ్రహాల ఎత్తుకోసం పోటీ పడుతుండడంతో తయారీదారులు సైతం మట్టి విగ్రహాలకు స్వస్తి పలికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. వీటికి వేసే రంగులు మాత్రం వాటర్ పెయింట్‌లనే వాడుతున్నామని చెబుతున్నారు. గతంలో ప్రధాన సెంటర్లకే గణపతి విగ్రహాలు ఏర్పాటు పరిమితమయ్యేది. అయితే నేడు ప్రతి సెంటర్లలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగి త్వరగా పూర్తయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీకే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మట్టి విగ్రహాల తయారీ కూడా చాలా కష్టంగా మారిందని తయారీదారులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలు తయారీకి ముందుగానే ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంటుంది. సమయం సరిపోకపోవడంతో రెడీగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకే ఉత్సవ కమిటీ సభ్యులు మక్కువ చూపిస్తున్నారు. ప్రతి సంవత్సరం పాలకొల్లు పట్టణంలో సుమారు 300 నుంచి 500 విగ్రహాల వరకూ విక్రయిస్తుంటారు. రెండు అడుగుల నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీటి ధర రూ.3,200 నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. పాలకొల్లు పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా నరసాపురం, మొగల్తూరు, తూర్పుగోదావరి జిల్లా రాజోలు, మల్కిపురం ఇలా పక్క జిల్లాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువెళుతుంటారు. ఒక్క పాలకొల్లులోనే చిన్న పెద్దా మండపాలు కలిపి సుమారు 80 నుంచి 100 మండపాలు వరకూ ఏర్పాటు చేస్తుంటారు. విగ్రహాల్లో నంది గణపతి, అయోధ్యరామ గణపతి, పార్వతి పరమేశ్వర గణపతి, నారద తుంబుర గణపతి విగ్రహాలను ఈ ఏడాది తయారు చేస్తున్నారు.

37 ఏళ్లుగా తయారు చేస్తున్నాం



37 ఏళ్లుగా విగ్రహాల తయారీ వృత్తిలో కొనసాగుతున్నాం. మట్టి విగ్రహాలు చేద్దామన్నా ఖర్చుతో కూడుకున్న పని. సమయం కూడా సరిపోవడం లేదు. ముందుగా చేస్తే మట్టి విగ్రహాలు పగుళ్లు వచ్చి పాడైపోతున్నాయి. దీంతో ఎక్కువగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలనే తయారు చేస్తున్నాం. పర్యావరణానికి హాని కలగకుండా విగ్రహాల రంగుల కోసం వాటర్ పెయింట్‌లే వాడుతున్నాం.

– ఇంటి ప్రసాద్, శిల్పి, పాలకొల్లు

ముడిసరుకు ధరలు పెరిగిపోయాయి



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ ధరలు పెరిగిపోయాయి. 25 కిలోల బస్తా రూ.350లకు చేరుకుంది. ఈ పౌడర్ రాజస్తాన్ నుంచి వస్తుంది. విగ్రహాల తయారీలో సుమారు 40 నుంచి 50 టన్నుల వరకు వినియోగిస్తుంటాం. విగ్రహాల డై నుంచి కావాల్సిన ఆకృతుల్లో విగ్రహాలను తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. విగ్రహాల తయారీకి పౌడర్‌తో పాటు పీచు, గెడలు ఉపయోగిస్తుంటాం.

– రాజు, విగ్రహాల తయారీదారుడు, పాలకొల్లు



శ్వేతవర్ణంలో గణనాథుల విగ్రహాలు



పరశురామ గణపతి



అయోధ్య రామ గణపతి

ఎస్వీకేపీ అధ్యక్షుడిగా నాగిరెడ్డి



తాడి నాగిరెడ్డి

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షుడిగా తాడి నాగిరెడ్డి ఎన్నికైనట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో గవర్నింగ్ బాడీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఇప్పటివరకూ అధ్యక్షుడిగా ఉన్న పితాని సూర్యనారాయణ ఆకస్మిక మృతితో ఈ ఎన్నిక అనివార్యమైంది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తాడి నాగిరెడ్డిని ప్రిన్సిపాల్స్ డాక్టర్ వైవీవీ అప్పారావు, కేవీఆర్ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు ఇందుకూరి పద్మావతి అభినందించారు.

ఇంటింటా జ్వరాలపై సర్వే



పెనుగొండలో ఓ మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పెనుగొండ: విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ అద్దాల ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం పెనుగొండలో ఇంటింటా సర్వే నిర్వహించారు. దోమల నివారణ చర్యలు చేపడితే జ్వరాల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కొబ్బరి డొక్కలు, పాత టైర్లు వంటి లేకుండా చూసుకోవడం ద్వారా దోమల నివారణ జరిగి జ్వరాల వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొప్పిశెట్టి సత్యనారాయణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వలకు చిక్కిన కొండచిలువ



సిద్ధాంతంలో గోదావరిలో చిక్కిన 12 అడుగుల కొండచిలువ

పెనుగొండ: సిద్ధాంతం వద్ద గోదావరిలో మత్స్యకారుల వలకు 12 అడుగుల భారీ కొండ చిలువ చిక్కింది. సిద్ధాంతంకు చెందిన మల్లాడి రాంబాబు గోదావరిలో చేపల వేటకు వెళ్లగా భారీ ఆకారం వలకు చిక్కడంతో భయాందోళనకు గురయ్యాడు. తీరా బయటకు తీసి చూడగా మృతి చెందిన కొండ చిలువ వలకు చిక్కడంతో ఊపిరి పీల్చుకున్నాడు. ఈ కొండచిలువను చూడడడానికి స్థానికులు బారులు తీరారు.

మాజీ జెడ్పీటీసీ రామారావు మృతి



బండి రామారావు

పెనుగొండ: ఆచంట మాజీ జెడ్పీటీసీ బండి రామారావు (68) శుక్రవారం మృతి చెందారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామారావు మృతికి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఇతర నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

వెంకన్న ఆలయంలో శ్రావణ పూజలు



మొగల్తూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మొగల్తూరు: శ్రావణమాస శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో మొగల్తూరులోని కేతీకీపుర సామ్రాజ్య శ్రీభూసమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వేకువ జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామివారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు జరిపారు. భారీ వర్షం కురుస్తున్నా గ్రామానికి చెందిన భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

పాలకొల్లు మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసి ఆరోగ్యవంతంగా జీవించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి కోరారు. పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపి కనకలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో మండల పరిషత్ ప్రతిపక్ష నేత శాగా సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడేళ్లలో ఏ ఎంపీటీసీకి ఎన్ని నిధులిచ్చారో లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో ఎంపీడీవో వెంకటేశ్వరరావు వివరణ ఇస్తూ ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా ఆరు నెలల క్రితం తాను బదిలీ అయి రెండు రోజుల క్రితమే మరలా విధుల్లో చేరానన్నారు. ఎంపీపీ కనకలక్ష్మి జోక్యం చేసుకుని ఎంపీటీసీల నుంచి సమాచారం తీసుకుని వచ్చే మంగళవారం లోపు వివరాలు చెబుతామన్నారు. సీడీపీవో సీహెచ్ ఇందిర మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తుంటే చాలా బాధేస్తుందని, కేవలం రేషన్ తీసుకునే కేంద్రాలుగా మారిపోతాయేమోనని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వాలమర్రు, పాలమూరు సర్పంచ్‌లు గంటా సత్యనారాయణ, పంచదార నారాయణస్వామి నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసేటప్పుడు ఆ సమాచారం గ్రామ సర్పంచ్‌లకు ఇవ్వాలన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు మాట్లాడుతూ గతంలో వలంటీర్లతో మీటర్లు ఆన్‌లైన్ చేయించారని, కొన్ని మీటర్లను వలంటీర్ల పేరున ఆన్‌లైన్ చేశారని, దీంతో వలంటీర్లకు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వీటిని సరిచేయాలని సూచించారు. ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ దిగమర్రు పంట కాలువ ప్రక్షాళనకు రూ.12.27 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అలాగే ప్రతి పంట కాలువ మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలతో అంచనాలు సిద్ధం చేశామన్నారు. దీంతో పాటు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో దిగమర్రు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ మాట్లాడుతూ తమ గ్రామంలో తక్షణం లైన్‌మేన్ మార్చాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి రూ.20 నుంచి రూ.25 లక్షల రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని ఏపీఎం కలిగిటి జ్యోతిరాణి చెప్పారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.850 కోట్లు బ్యాంకింగ్ రుణాలు అందించామని, అలాగే డ్వాక్రా గ్రూపులు తయారు చేసే ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెట్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమం మొక్కుబడిగా సాగిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు కేవలం ఫొటోలకు పరిమితమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులను సంప్రదించి డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని కోరారు. దీనిపై ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు వివరణ ఇస్తూ ఇక నుంచి సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చి డ్రై డే నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పడవల సునీల్ బాబు, యన్నాబత్తుల నాగేశ్వరరావు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ కేఎం వైభవతి, ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్ఎస్‌వీస్ గంగాధరశర్మ, ఏఈలు మూర్తి, శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



పోలీసు అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా, కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహకరించాలని నరసాపురం సీనియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు సూచించారు. సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమవేశంలో జడ్జి మాట్లాడారు. ఈ జాతీయలోక్ అధాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా పోలీసు అధికారులు సహకరించాలని చెప్పారు. గూగుల్ మీట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమకు దగ్గరగా ఉన్న కోర్టుల ద్వారా కూడా కేసులు రాజీ చేస్తామన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను కక్షిదారులు గుర్తించాలని చెప్పారు. ఈ విషయంలో కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు వివరించారు. గడిచిన కొంతకాలంగా లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు రాజీ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి, రూరల్ సీఐ దుర్గాప్రసాద్, పాలకొల్లు రూరల్ సీఐ జి.శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వకూడదు



ఆచంటలో తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న జేసీ రాహూల్‌కుమార్ రెడ్డి

పెనుగొండ: కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆచంట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ చేసే సమయంలో తప్పనిసరిగా వెళ్లి వారి వివరాలు ధ్రువీకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.సుగుణసంధ్య, సీహెచ్ జయలలిత, వీఆర్వో సీతారామ్ ఉన్నారు.

ఆదుకునే నాథులేరీ?



అన్న క్యాంటీన్ ఎదురుగా రోడ్డుపై ఉన్న వృద్ధుడు



న్యూ క్లాత్ మార్కెట్ రోడ్డులో పడిపోయి ఉన్న ఓ వ్యక్తి

పాలకొల్లు సెంట్రల్: ఎవరి ఆదరణకూ నోచుకోకనడి రోడ్డుపై జీవచ్ఛవాల్లా అత్యంత దయనీయమైన స్థితిలో బతుకు వెళ్లదీస్తూ తమకు ఆపన్న హస్తం అందించే వారి కోసం ఎదురుచూస్తున్నారు కొందరు వృద్ధులు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని లాకుపేటకు చెందిన వృద్ధుడు నరసింహారావు గత కొన్ని రోజులుగా ఒంటరిగా చాలా జీవనాన్ని గడుపుతున్నాడు. కొన్నాళ్ల నుంచి అన్నా క్యాంటీన్ వద్దే అరుగుపై పడుకుంటూ జీవనం సాగించాడు. ఇటీవల అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం కావడంతో క్యాంటీన్ ఎదురుగా ఉన్న డివైడర్‌కు ఆనుకుని తాను నడిచే వాకర్ స్టాండ్‌పై ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నాడు. ఎండైనా వానైనా తినడం, పడుకోవడం అన్నీ అక్కడే. దీనికి తోడు కాలుకు గాయమై కదలలేని స్థితిలో ఉన్నాడు. ప్రతి నెలా పెన్షన్ అందుకుంటున్నాడు. నరసింహారావును పలకరించగా తనకు తన అన్న బిడ్డలు ఉన్నారని, తాను ఇంటి నుంచి వచ్చేశానని, రెండు రోజుల్లో ఇంటికి వెళ్లిపోతానని చెబుతున్నాడు. అయితే స్థానికులు మాత్రం గత కొన్ని రోజులుగా ఇక్కడే ఉంటున్నాడని, ఎవరూ రావడం లేదని చెబుతున్నారు. అలాగే మెయిన్ రోడ్డు వద్ద న్యూక్లాత్ మార్కెట్ రోడ్డులో అనంత మెడికల్ షాపు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి నాలుగు రోజులుగా ఇలానే ఉన్నాడని, ఏమి మాట్లాడలేకపోతున్నాడని స్థానికులు చెబుతున్నారు. కొందరు ఇతనికి వైద్యం చేయించేందుకు 108కు ఫోన్ చేయగా, హెల్పర్స్ ఎవరూ లేకపోతే కుదరదని చెప్పి వెళ్లిపోయారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీరిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని, లేదా ఏదైనా వృద్ధాశ్రమంలోనైనా చేర్పించాలని కోరుతున్నారు.

బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

భీమవరం అర్బన్: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ప్రతి విద్యార్థినీ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వి.కనకమహాలక్ష్మి సూచించారు. భీమవరం మండలంలోని వెంప పంచాయతీ పల్లిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్లో శనివారం 100 రోజుల పాటు జరిగే మిషన్ శక్తి పథకంలో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్నపిల్లల దశ నుంచే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై తల్లి, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా తమ పట్ల చెడు ప్రవర్తనను కలిగియుంటే వెంటనే విద్యార్థినులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అలాగే మోసం చేసే వ్యక్తుల నుంచి తమను రక్షించుకునే విధంగా ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థినుల్లో పెంపొందింపజేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలపై కలిగే నష్టాలు, మహిళలపై దాడులు జరిగితే కఠిన శిక్షలను వివరించారు.